క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్, హనుమకొండ, కాజీపేటలోని పలు ప్రాంతాల్లో ఈనెల 18న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి, వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. హనుమకొండ మచిలీబజార్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9నుంచి 11గంటల వరకు, ఆర్ఈసీ (నిట్) సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, వడ్డెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, కేయూ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. అలాగే, వరంగల్‌లోని ఏనుమాముల, మామునూరు, ఉర్సు, పోచమ్మమైదాన్, ఆరెపల్లి, దేశాయిపేట, కేఎంసీ, శంభునిపేట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వారు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

నేడు నేషనల్ నేచురోపతి డే వేడుకలు

కేయూ క్యాంపస్: హనుమకొండ ప్రకాశ్‌రెడ్డిపేటలోని ప్రొఫెసర్ గజ్జల రామేశ్వరం ఇంటర్నేషనల్ నేచురోపతి లైబ్రరీ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో ఈనెల 18న ఉదయం నేషనల్ నేచురోపతి డే వేడుకలు, పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈమేరకు లైబ్రరీ, రీసెర్చ్ సెంటర్ వ్యవస్థాపకుడు, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ గజ్జల రామేశ్వరం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా హనుమకొండ జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ యాకూబ్‌పాషా, కాజీపేటలోని పతంజలి యోగా నేచర్ క్యూర్ హాస్పిటల్ డాక్టర్ సీహెచ్.సుదర్శన్, కేయూ సైకాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ రాంచంద్రం, హోమియోపతి రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్‌రావు, కేయూ లైబ్రరీ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ రాధికారాణి, ఆయుర్వేదిక్ డాక్టర్ ఆర్‌జే.ప్రసాద్, కవి, రచయిత వీఆర్.విద్యార్థి, పతంజలి యోగా అసోసియేషన్ అధ్యక్షుడు జితేందర్, ఆక్యుపంక్చర్ డాక్టర్ సోమయ్య, లైబ్రేరియన్ శంకరయ్య పాల్గొంటారని పేర్కొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీదే గెలుపు



మాట్లాడుతున్న దినేష్ గుండురావు

న్యూశాయంపేట: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కర్ణాటక ఆరోగ్యశాఖ మంత్రి, వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు దినేష్ గుండురావు అన్నారు. ఈమేరకు వరంగల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజలు బలంగా నమ్ముతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో చాలా వ్యతిరేకత ఉందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సంపూర్ణ మెజారిటీ సాధించి తెలంగాణలో కర్ణాటక తరహా పథకాలు అమలు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ అజహర్, మహ్మద్ ముదస్సిర్, మహ్మద్ అబ్దుల్ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

కళోత్సవ్‌కు ఎంపికైన విద్యార్థికి సన్మానం



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ధర్మేంద్ర

విద్యారణ్యపురి: హైదరాబాద్‌లో ఈనెల 15, 16వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కళా ఉత్సవంలో పలు సాంస్కృతిక విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం (ఎంపీసీ) విద్యార్థిని పుప్పాల అక్షర పాల్గొని మృదంగంలో ప్రతిభ కనబరిచారు. ప్రథమ బహుమతి సాధించి జాతీయస్థాయి కళా ఉత్సవానికి ఎంపికయ్యారు. కాగా, ఆమెను కళాశాలలో ప్రిన్సిపాల్ ధర్మేంద్ర, అధ్యాపకులు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చూపాలని అక్షరకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మాధవి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ



ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్న అధికారులు, ఆశవర్కర్లు

కాజీపేట అర్బన్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలో శుక్రవారం ఇంటింటికి ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. ఎన్నికల ప్రత్యేక పర్యవేక్షణ అధికారులతో పాటు ఆశవర్కర్లు ఇంటింటికి వెళ్లి ఓటరు స్లిప్పులను పంపిణీ చేసి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు.

ఓట్ల కోసం మాయగాళ్లు వస్తున్నారు



హసన్‌పర్తి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేష్



హసన్‌పర్తి: ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

- బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేష్

హసన్‌పర్తి : నియోజకవర్గంలో ఇంతవరకు ఎప్పుడూ కనిపించని కొందరు మాయగాళ్లు ఓట్ల కోసం వస్తున్నారని, ఈక్రమంలో వారి మాటలను ప్రజలు నమ్మొద్దని బీఆర్ఎస్ వర్ధన్నపేట నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హసన్‌పర్తి మండలంలోని భీమారం, ముచ్చర్ల, పెగడపల్లి, పలివేల్పుల గ్రామాల్లో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం, రమేష్ మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల పాటు నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారికి సేవ చేసినట్లు తెలిపారు. కార్యకర్తలకు కంటికి రెప్పలా కాపాడినట్లు వివరించారు. అభివృద్ధిలో నియోజకవర్గాన్ని ముందువరుసలో నిలిపినట్లు, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. ఎన్నికలు రాగానే కాంగ్రెస్ అభ్యర్థికి నియోజకవర్గం గుర్తుకొచ్చిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్‌రాజ్, బీఆర్ఎస్ నాయకుడు రాకేష్‌రెడ్డి, కార్పొరేటర్లు జక్కు రజిత, రవినాయక్, డివిజన్ అధ్యక్షులు నరెడ్ల శ్రీధర్, అటికం రవీందర్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, దేవస్థాన కమిటీ చైర్మన్ లక్ష్మణ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ విజయ్, నాయకులు టీఆర్‌కే.రెడ్డి, నాయకపు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

వర్ధన్నపేట : వర్ధన్నపేట మండలంలోని కొత్తపల్లి, ల్యాబర్తి, రామవరం, వర్ధన్నపేట పట్టణం నుంచి పలువురు కార్యకర్తలు, మాజీ ఎంపీటీసీలు, బీజేపీ, టీడీపీ కార్యకర్తలు.. బీఆర్ఎస్ నేత ఈగ మల్లేశం ఆధ్వర్యంలో గురువారం రాత్రి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేష్‌ను అధిక మెజారిటీతో గెలిపించుకునేందుకు కృషి చేయాలని మల్లేశం కోరారు.



వర్ధన్నపేట: పార్టీలోకి ఆహ్వానిస్తున్న మల్లేశం

తూర్పులో బీజేపీ గెలుపు ఖాయం

- పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు



బొరిశెట్టి శ్రీలతకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పొన్న రాధాకృష్ణన్

కాశిబుగ్గ: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఓసిటీలోని క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు బొరిశెట్టి శ్రీలత, బొరిశెట్టి సునీత శుక్రవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కేంద్ర మాజీ మంత్రి పొన్న రాధాకృష్ణన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం, ప్రదీప్‌రావు మాట్లాడుతూ తమ అభ్యర్థిపై కాంగ్రెస్ నాయకులు నమ్మకం కోల్పోయి బీజేపీలో చేరుతున్నారని చెప్పారు. బీజేపీతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని అన్నారు. తన గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, కుసుమ సతీష్, సిద్ధం నరేష్ పటేల్, గంటా రవికుమార్, బొరిగం నాగరాజు, కోమాకుల నాగరాజు, రాజేశ్వరరావు, కర్నె రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: వరంగల్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఈ నెల 25లోగా ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట రిటర్నింగ్ అధికారులు షేక్ రిజ్వాన్ బాషా, అశ్వినీ తానాజీ వాకడే, కృష్ణవేణి, నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. సమాచార ఓటరు స్లిప్పుల పంపిణీ, హోమ్ ఓటింగ్ ప్రణాళిక, పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటు, డిస్ట్రిబ్యూషన్, రూట్ ప్రణాళిక, ఎన్నికల సిబ్బందికి శిక్షణ తదితర ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే ఓటరు సమాచార స్లిప్పులను బూత్‌లెవెల్ అధికారుల ద్వారా పంపిణీ ప్రారంభమైందని, ఓటరు సమాచార స్లిప్పులను కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పంపిణీ చేయాలన్నారు. జిల్లాలోని 791 పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు ఉండేలా చూసుకోవాలన్నారు. సెక్టార్ అధికారులు, హోమ్ ఓటింగ్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జరిగేలా మానిటరింగ్ చేయాలన్నారు. అడిషనల్ డీఈఓ, ఆర్డీఓ వాసుచంద్ర, అడిషనల్ ఏఆర్ఓ అనీసుర్‌రషీద్, జిల్లా నోడల్ అధికారులు, ఏఆర్ఓలు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ పరిశీలన

ఖిలా వరంగల్: నిర్దేశిత గడువులోగా ఓటరు సమాచార స్లిప్పులను పంపిణీ చేయాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. ఈ మేరకు శుక్రవారం రంగశాయిపేట, శంభునిపేటలో జరుగుతున్న ఓటరు స్లిప్పుల పంపిణీ తీరును కలెక్టర్ పరిశీలించారు. సకాలంలో ఓటరు స్లిప్పులు, పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు.

ప్రకృతిని మించిన వైద్యుడు లేడు



విజేతకు నగదు బహుమతి అందజేస్తున్న శ్రీనివాస్, రామేశ్వరం, ఉపాధ్యాయులు

విద్యారణ్యపురి: ప్రకృతి మానవుల పాలిట గొప్ప వరం అని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత తామందరిపై ఉందని కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ రిటైర్డ్ ప్రొఫెసర్, హనుమకొండలోని అంతర్జాతీయ ప్రకృతి వైద్య సాహిత్య లైబ్రరీ అండ్ రీసెర్చ్ సెంటర్ వ్యవస్థాపకుడు గజ్జల రామేశ్వరం గుర్తుచేశారు. జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 'మానవ జీవన విధానంలో ప్రకృతి పాత్ర' అనే అంశంపై హనుమకొండ జిల్లా స్థాయిలో విద్యార్థులకు శుక్రవారం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రకృతి పరిరక్షణపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ప్రొఫెసర్ సత్యనారాయణ, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, జిల్లా సోషల్ ఫోరం అధ్యక్షుడు అలిగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉమాదేవి, గెజిటెడ్ హెచ్‌ఎం రాజేష్‌కుమార్, సోషల్ ఫోరం బాధ్యులు పాల్గొన్నారు. జిల్లాస్థాయి ఉపన్యాస పోటీల్లో ఎల్కతుర్తి మోడల్ స్కూల్ విద్యార్థి హెచ్.లక్కీ (9వ తరగతి) ప్రథమ బహుమతి సాధించి రూ 3వేలు అందుకుంది. ధర్మసాగర్ మండలం మల్లకపెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన డీ.మానస (9వ తరగతి) ద్వితీయ బహుమతి సాధించి రూ.2 వేలు, కమలాపూర్ మండలం శనిగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.రక్షిత (9వ తరగతి) తృతీయ బహుమతి సాధించి రూ.వేయి నగదు బహుమతి అందుకున్నారు. కాగా, లక్కీ రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

రైతుల ఎదురుచూపులు

- ఏర్పాటు చేయని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- దృష్టి సారించని అధికారులు



ప్రైవేట్ వెంచర్‌లో ఆరబోసిన ధాన్యం

మడికొండ: కాజీపేట మండల పరిధిలో పదిరోజుల క్రితం వరి కోతలు మొదలయ్యాయి. ఈ క్రమంలో ధాన్యం ఆరబోసి విక్రయానికి ఎదురు చూస్తున్నారు. అయితే ఇంకా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యం కుప్పల వద్ద పగలు, రాత్రి కాపలా కాస్తూ ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కొంతమంది రైతులు దళారులను ఆశ్రయిస్తూ నష్టపోతున్నారు. ప్రభుత్వమే స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరతో వరిధాన్యం కొనుగోలు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి



టాస్ వేస్తున్న డీవైఎస్ఓ సత్యవాణి

కాశిబుగ్గ: చదువుతోపాటు యువత అన్ని రంగాల్లో రాణించాలని వరంగల్ జిల్లా యువజన క్రీడల అధికారి (డీవైఎస్ఓ) సత్యవాణి అన్నారు. ఓటు హక్కుపై యువతకు అవగాహన కల్పించడానికి జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు శుక్రవారం దేశాయిపేట సీకేఎం కళాశాల మైదానంలో జిల్లా స్థాయి స్వీప్ కప్ క్రికెట్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డీవైఎస్ఓ మాట్లాడుతూ ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన గొప్ప హక్కు అని దానిని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొదటి రోజు పోటీల్లో ఎల్‌బి కళాశాల జట్టు పాలిటెక్నిక్ కాలేజీ జట్టుపై విజయం సాధించింది. రెండవ మ్యాచ్‌లో డీఎస్ఏ వరంగల్ జట్టు సీకేఎం కళాశాల జట్టుపై విజయం సాధించిందని ఆమె తెలిపారు. ఈ పోటీల్లో సీకేఎం కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రమేష్, స్పోర్ట్స్ అథారిటీ క్రికెట్ కోచ్ సుమన్, టెక్నికల్ ఆఫీషియల్స్ కార్తిక్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన కేసీఆర్



నినాదాలు చేస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగులకు గతంలో హామీలు ఇచ్చి అవి అమలు చేయకుండా వారిని సీఎం కేసీఆర్ మోసం చేశారని, ఈక్రమంలో బీఆర్ఎస్ పార్టీని చిత్తుగా ఓడించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ కోరారు. కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద రోడ్డుపై శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా విద్యారంగ సమస్యలు, నిరుద్యోగులను కేసీఆర్ పట్టించుకోలేదని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం, కేజీ టు పీజీ ఉచిత విద్య వంటి, నిరుద్యోగ భృతికి హామీలను తుంగలో తొక్కారని ఎద్దేవాచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేయూ నాయకులు స్టాలిన్, మచ్చ పవన్ కల్యాణ్, ప్రవీణ్, సందీప్, రాజ్‌కుమార్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి



ఎల్కతుర్తి: కిశోర బాలికల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సీడీపీఓ స్వరూప సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో భీమదేవరపల్లి ప్రాజెక్టు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బేటీ పడావో.. బేటీ బచావో కార్యక్రమం నిర్వహించి పలు సూచనలు చేశారు. లింగ నిర్ధారణ, లింగ వివక్ష చూపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఆడపిల్లలపై వివక్ష చూపకూడదని చెప్పారు. వివక్ష చూపినట్లు తమ దృష్టికి తీసుకొస్తే చట్టపరమైన చర్య తీసుకుంటామని స్పష్టం చేశారు.

సమాజ మనుగడకు ప్రతీ ఓటు కీలకం



కార్యక్రమంలో స్వీప్ అధికారి, మెప్మా ప్రతినిధులు

వరంగల్ అర్బన్ / ఖిలా వరంగల్: సమాజ మనుగడకు ప్రతీ ఓటు కీలకమని, ఈ క్రమంలో ఓటర్లందరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని స్వీప్ నోడల్ అధికారి రాజేష్ సూచించారు. నగరంలో ఓటర్ల నమోదుశాతం పెంచడమే ధ్యేయంగా వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమాలు నిర్వహించారు. మెప్మా ఆధ్వర్యంలో వరంగల్ తూర్పులోని లెనిన్‌నగర్, రంగశాయిపేట, గిర్మాజీపేట, పుప్పాలగుట్ట స్లమ్ ప్రాంతాల్లోని ఓటర్లకు ఓటు హక్కుపై శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఓటు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాముఖ్యతపై జరిగిన ర్యాలీలో స్వయం సహాయక మహిళా బృందాల సభ్యులతో పాటు స్థానిక మహిళలు, ప్రజలు పాల్గొన్నారు. ఎస్‌వీఈఈపీ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ -స్వీప్) 2023లో భాగంగా ఓటరు ప్రచార రథంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల ద్వారా ఓటు వేయు విధానంతో పాటు వేసిన ఓటు నిర్ధారణ వంటి అంశాలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. టీఎంసీ రమేష్, సీఓ రజిత పాల్గొన్నారు.

మిషన్ ఆస్పత్రి భూములను రక్షించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పీఏబీసీ ప్రతినిధులు

ఖిలా వరంగల్: భూ కబ్జాదారుల చేతుల్లో చిక్కిన రూ.కోట్ల విలువైన హనుమకొండ మిషన్ హాస్పిటల్ ఆస్తులను పరిరక్షించాలని, నిందితులపై చట్టరీత్యా చర్య తీసుకుని క్రైస్తవులకు న్యాయం చేయాలని మిషన్ ప్రాపర్టీ అడిషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్రాపర్టీ అసోసియేషన్ ఆఫ్ బాప్టిస్టు చర్చెస్ (పీఏబీసీ) ప్రతినిధి మంద సురేందర్‌బాబు కోరారు. వరంగల్ శంభునిపేటలోని ఓ చర్చిలో శుక్రవారం జరిగిన సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండలో 1147 - 1150 సర్వే నంబర్లలోని మిషన్ హాస్పిటల్‌కు రూ.వందల కోట్ల విలువైన భూములను కొంతమంది కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. కబ్జాదారులపై చర్య తీసుకోవాలని ఫిర్యాదు చేసినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. రూ.వందల కోట్ల విలువైన ట్రస్ట్ ఆస్తులపై కన్నేసిన ఓ పోలీస్ అధికారితోపాటు ఆరుగురు వ్యక్తులను ప్రజాప్రతినిధులు, పోలీసులు కాపాడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో పాస్టర్లు పోలెపాక సుమన్, జేజే.థామస్ ప్రభాకర్, రుద్రోజు జయప్రకాశ్, డీకే.రవి, పీ.ప్రసింగి పాల్గొన్నారు.

వైభవంగా నాగుల చవితి



ఖిలా వరంగల్: ఉర్సు నాగేంద్రస్వామి ఆలయంలో పుట్ట వద్ద మహిళలు



బారులుదీరిన భక్తులు



మెట్టుగుట్టపై పుట్ట వద్ద పూజ చేస్తున్న భక్తులు

మడికొండ: నగర వ్యాప్తంగా నాగుల చవితి వేడుకలను భక్తులు శుక్రవారం వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పుట్టలో పాలుపోసి నాగేంద్రుడికి పూజలు చేశారు. కార్తీక మాసోత్సవాల సందర్భంగా మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో నాగుల చవితి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామికి ఫల, పంచామృతాలతో సర్ప పశుపద అభిషేకం చేశారు. విజయగణపతి ఆలయ ప్రాంగణంలో ఉన్న పుట్ట వద్ద వల్మీక పూజ నిర్వహించారు. మెట్టుగుట్టపై సాయంకాలం సంధ్యాసమయంలో హరిహరులకు వైభవంగా ఆకాశ దీపోత్సవం, శివాలయంలో ప్రదోషకాల రుద్రాభిషేకం, నీరాజన మంత్రపుష్పం, నక్షత్ర హారతి, చతుర్వేద స్వస్తి, రాజోపచార పూజలు, పవళింపు సేవ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పారుపల్లి సత్యనారాయణశర్మ, విష్ణువర్ధనాచార్యులు, సాయిశర్మ, దేవేంద్ర శర్మ, మణిశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఖిలా వరంగల్‌లో..

ఖిలా వరంగల్: కార్తీకమాసం సందర్భంగా వరంగల్ శంభునిపేట ఉర్సు ప్రతాప్‌నగర్‌లోని నాగేంద్రస్వామి దేవాలయంలో మహిళలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీరాం శర్మ, ఆలయ ఈఓ కమల ఆధ్వర్యంలో నాగేంద్రుడికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ ధర్మకర్తలు తీర్థప్రసాదాలు అందజేశారు. రావి చెట్టు, జమ్మి చెట్ల వద్ద మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. అలాగే, శివనగర్‌లోని సీతారామచంద్రస్వామి దేవాలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన పూజారి వెంకటేశ్వర్లు చార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పుట్టలో పాలుపోసి నాగేంద్రస్వామిని దర్శించుకున్నారు.

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న సభ్యులు, వ్యాపారులు

కాశిబుగ్గ: రక్తదానం మరొకరికి ప్రాణదానం లాంటిదని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్మన్ మండల పరశురాములు, అభయ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ బిట్ల సరిత అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పిలుపు మేరకు తెలంగాణ పాడుపు మార్కెటింగ్ సహకార సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తనిధి కొరత ఏర్పడిందని రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు తెలుపగా వెంటనే స్పందించి శిబిరం నిర్వహించి రక్తదానం చేసిన సహకార సంఘం సభ్యులు, వ్యాపారులను అభినందించారు. 60మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన మార్కెట్ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం సభ్యులు బిట్ల కృష్ణ, పాపని భాస్కర్, రాజు, అలీ, మురళి, శేఖర్, ప్రకాశ్, వ్యాపారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

మామునూరు: వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఎస్సై కృష్ణవేణి.. ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ కాశిబుగ్గకు చెందిన కొంగు రుషికేష్ బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం ఇంటిలో నుంచి బైక్‌పై కళాశాలకు బయలుదేరాడు. ఈక్రమంలో వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిలో టీఎస్ఎస్పీ బెటాలియన్ సమీపంలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద బైక్‌ను ఎదురుగా వచ్చిన డీసీఎం వాహనం బలంగా ఢీకొట్టింది. దాంతో ఆ విద్యార్థి తల, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై కృష్ణవేణి అక్కడికి చేరుకుని వాహనంలో ఎంజీఎంకు తరలించారు.

వేయిస్తంభాల దేవాలయంలో పూజలు



నాగేంద్రస్వామికి అభిషేకం చేస్తున్న ఉపేంద్రశర్మ

హన్మకొండ కల్చరల్ : నాగుల చవితిని పురస్కరించుకుని వేయిస్తంభాల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితుడు మణికంఠశర్మ, అర్చకులు ఉదయం నుంచి సుప్రభాత పూజలు, మూలగణపతికి ఆరాధన, రుద్రేశ్వరుడికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. నాట్యమండపంలో శ్రీవల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవమూర్తులకు అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని నాగేంద్రస్వామి పుట్టలో మహిళలు ఆవుపాలు పోశారు.